## జర్నలిస్టుల ఆందోళనకు బీఆర్ఎస్ మద్దతు


మాట్లాడుతున్న రేగా కాంతారావు

కొత్తగూడెం సింగరేణి, మార్చి 24: కొత్తగూడెంలో తమ ఇళ్ల నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని అప్పగించాలన్న డిమాండుతో జర్నలిస్టులు సాగిస్తున్న ఆందోళనకు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు మద్దతు తెలిపారు. ఇండ్ల స్థలాల కోసం ఐదు రోజులుగా కొత్తగూడెంలో జర్నలిస్టులు సాగిస్తున్న నిరసన శిబిరాన్ని ఆయన సోమవారం సందర్శించి సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. కొత్తగూడెంలోని గంగాబిషన్ బస్తీలో (సింగరేణి మ్యాగ్జిన్) 10.18 ఎకరాల స్థలాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం కేటాయించిందన్నారు. అనివార్య కారణాలు, ఎన్నికల కోడ్ కారణంగా ఆ స్థలాన్ని తమ ప్రభుత్వం అందించలేకపోయిందని అన్నారు. ఆ తర్వాత వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చే విషయాన్ని విస్మరించిందని విమర్శించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ కాపు సీతాలక్ష్మి, మాజీ ఎంపీపీ బదావత్ శాంతి, నాయకులు కొట్టి వెంకటేశ్వర్లు, లావుడ్యా సత్యనారాయణ, అనుదీప్, హుస్సేన్, తొగరు రాజశేఖర్ పాల్గొన్నారు.

## వేడి నీటి బుగ్గల ప్రదేశాన్ని పరిశీలించిన కలెక్టర్


మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

మణుగూరు టౌన్, మార్చి 24: మణుగూరు మండలం పగిడేరులో వేడినీటి బుగ్గల ప్రదేశం జియో థర్మల్ ప్లాంట్‌ను కలెక్టర్ జితేష్ వి పాటిల్ సోమవారం సందర్శించారు. ఈ ప్రాంతాన్ని పరిశీలించి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. స్థానిక సాంబాయిగూడెం ఇసుక ర్యాంప్‌ను పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. నిబంధనల ప్రకారం ఇసుక రవాణా జరగాలని అధికారులను ఆదేశించారు. రథం గుట్ట, మణుగూరు అంబేద్కర్ పార్కు, సింగరేణి మైన్స్, కొండాయిగూడెం, గోదావరి, పగిడేరు వేడి నీటి బుగ్గలను ఒక ప్యాకేజీ రూపంలో మండలాన్ని మంచి పర్యాటకంగా తీర్చిదిద్దేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట తహసీల్దార్, ఎంపీడీవో, స్థానిక అధికారులు ఉన్నారు.

## కలెక్టరేట్‌లో 'ప్రజావాణి'

కొత్తగూడెం టౌన్, మార్చి 24: కలెక్టరేట్‌లో సోమవారం 'ప్రజావాణి'ని అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యాచందన నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## వసతి గృహాన్ని సందర్శించిన పీవో

ములకలపల్లి, మార్చి 24: మండలంలోని కమలాపురంలోగల గిరిజన ఆశ్రమ హాస్టల్‌ను ఐటీడీఏ పీవో రాహుల్ సోమవారం రాత్రి సందర్శించారు. ఇక్కడ ఆదివారం అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాద కారణాలను వార్డెన్ నుంచి తెలుసుకున్నారు. పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడారు.

## మునగ సాగుతో అధిక లాభాలు

అన్నపురెడ్డిపల్లి, మార్చి 24: మునగ సాగుతో అధిక లాభాలు పొందవచ్చని ఎంపీడీవో మహాలక్ష్మి అన్నారు. మండలంలోని నర్సాపురం పంచాయతీ రైతులకు మునగ సాగుపై ఆమె సోమవారం అవగాహన కల్పించారు. చిన్న, సన్నకారు రైతులకు ఉపాధి హామీ పథకం కింద మునగ సాగుకు సబ్సిడీ ఇస్తున్నట్లు చెప్పారు.

## అంగన్‌వాడీల డిమాండ్లు పరిష్కరించాలి

కొత్తగూడెం గణేష్ టెంపుల్, మార్చి 24: తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది సోమవారం కలెక్టరేట్‌లో వినతిపత్రం ఇచ్చారు. తమకు పది నెలల ఇంటి అద్దె బకాయిలు, ఆరోగ్య లక్ష్మి బిల్లులు రావాల్సుందని జిల్లా అధ్యక్షురాలు గోనె మణి చెప్పారు. కూరగాయాల బిల్లులు పెంచాలని కోరారు. 24 రోజుల సమ్మె జీతం పడలేదని, గ్యాస్ బిల్లులు కూడా ఆరు నెలలుగా రావడం లేదని వివరించారు. ప్రతి నెలా ఒకటో తేదీన వేతనం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని, ఆయా నుంచి టీచర్‌గా ప్రమోషన్ పొందిన వారికి తదనుగుణంగా జీతాలు ఇవ్వాలని, ప్రీ స్కూల్ నడవాలంటే అదనపు డ్యూటీలు వేయకూడదని, బీఎల్‌వో డ్యూటీలు రద్దు చేయాలని, స్టేషనరీ బిల్స్, ట్యాబ్‌లు ఇవ్వాలని కోరారు.

## పాఠశాలలో గ్రంథాలయం ప్రారంభం

పాల్వంచ రూరల్, మార్చి 24: మండలంలోని జగన్నాథపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వాసవి సోషల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా బాధ్యులు రూ.40వేల విలువైన పుస్తకాలను ఇటీవల అందించారు. వీటితో ఏర్పాటైన గ్రంథాలయాన్ని సొసైటీ అధ్యక్షుడు కొత్వాల శ్రీనివాసరావు సోమవారం ప్రారంభించారు. ఈ గ్రంథాలయం ఏర్పాటుకు చొరవ చూపిన ఉపాధ్యాయురాలు దుర్గాశైలజను అభినందించారు. ఎంపీడీవో విజయభాస్కర్ రెడ్డి, ఉపాధ్యాయులు భవానీదేవి, పాపారావు, మాధవి, మణి, శ్రీనివాసరావు, వెంకటరెడ్డి, వెబ్కా, అరుణ, వేదకుమారి, సత్యవతి, గంగ తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక సొసైటీని మాకే ఇవ్వాలి

**సమ్మక్క-సారక్క సొసైటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద నిరసన**

**అడ్డుకున్న పోలీసులు.. కొంతమందికే 'ప్రజావాణి'కి అనుమతి**


గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందించిన తర్వాత కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న మణుగూరు మండలం చినరాయిగూడెం ఇసుక క్వారీ లేబర్ సొసైటీ సభ్యులు

భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 24 (నమస్తే తెలంగాణ): ఇసుక క్వారీని తమకే కేటాయించాలని మణుగూరు మండలం చినరాయిగూడెం సమ్మక్క – సారక్క ఇసుక క్వారీ లేబర్ సొసైటీ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు భద్రాద్రి కలెక్టరేట్ వద్ద సోమవారం పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ఏడేళ్లుగా అదే గ్రామానికి చెందిన కొద్దిమంది సభ్యులు మాత్రమే ఉన్న సొసైటీకి దొడ్డిదారిలో ఇసుక సొసైటీని అప్పగించారని ఆరోపించారు. సమస్యలను కలెక్టర్‌కు వివరించేందుకు కలెక్టరేట్‌ను వచ్చిన 130 సభ్యులను గేటు వద్ద పోలీసులు అడ్డుకున్నారు. అంతమంది లోపలికి వెళ్లేందుకు వీల్లేదని చెప్పడంతో గేటు వద్దనే నిరసన తెలిపారు. ప్రజావాణిలో వినతి పత్రం ఇస్తామని చెప్పడంతో పోలీసులు కొద్దిమందిని అనుమతించారు. వారు ప్రజావాణిలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ ఘటనపై విచారణ చేస్తామని అదనపు కలెక్టర్ హామీ ఇచ్చారు. అనంతరం గేటు బయట చేపట్టిన నిరసనలో సొసైటీ సభ్యులు మాట్లాడుతూ.. తక్కువ మంది సభ్యులున్న సొసైటీకి తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ పీవో దొడ్డిదారిన ఇసుక క్వారీని అప్పగించారని ఆరోపించారు. ఎక్కువ మంది సభ్యులమున్న తమకు ఎందుకు ఇవ్వలేదని, తాము అర్హులకు కాదా? అని ప్రశ్నించారు. సొసైటీ సభ్యులు తెల్లం నాగమణి, సోంది నర్సమ్మ, కుంజా ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# అప్రమత్తతతోనే క్షయ వ్యాధి నివారణ


కరకగూడెం: ర్యాలీ ప్రారంభిస్తున్న వైద్య సిబ్బంది

కరకగూడెం, మార్చి 24: అప్రమత్తతతోనే క్షయ( టీబీ) వ్యాధిని నివారించవచ్చని పీహెచ్‌సీ వైద్యాధికారులు మధు, రవితేజ పేర్కొన్నారు. సోమవారం ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో వైద్యసిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అనంతరం క్షయ నివారణపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. టీబీ లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని, లేదంటే మిగతా వారికి కూడా ఆ వ్యాధి సోకే అవకాశం ఉంటుందన్నారు. టీబీ వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా ఆరునెలలు చికిత్స పొందాలన్నారు.

చర్ల, మార్చి 24: సత్యనారాయణపురం పీహెచ్‌సీ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. క్షయ వ్యాధి లక్షణాలు, నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు, అందుబాటులో ఉన్న ప్రభుత్వ వైద్యం గురించి డాక్టర్ దివ్యనయన వివరించారు. వైద్యులు డాక్టర్ నగేష్, సత్యనారాయణపురం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పర్ణశాల, మార్చి 24: పర్ణశాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వరల్డ్ టీబీ డే ర్యాలీని నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి రేణుకారెడ్డి టీబీ గురించి ప్రజలకు వివరించారు.

కొత్తగూడెం గణేష్ టెంపుల్, మార్చి 24: వరల్డ్ టీబీ డే సందర్భంగా సోమవారం కొత్తగూడెంలో ర్యాలీని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ జెండా ఊపి ప్రారంభించారు. క్షయ వ్యాధి లక్షణాలను డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్ నాయక్ వివరించారు.

టేకులపల్లి, మార్చి 24: మండలంలోని సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది టేకులపల్లిలో ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ వెంకటేష్, ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ విజయ శ్రీ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వజ్జ పార్వతి, టీబీ నోడల్ ఆఫీసర్ నాగుబండి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ములకలపల్లి, మార్చి 24: మంగపేట ఆరోగ్య కేంద్రం డాక్టర్ సాయి కల్యాణ్ ఆధ్వర్యంలో సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. సూపర్‌వైజర్, స్టాఫ్ నర్స్, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

ఇల్లెందు రూరల్, మార్చి 24: మండలంలోని రొంపేడు, కొమరారం పీహెచ్‌సీల వైద్యులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ కవిత, డాక్టర్ లోహిత, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

## సీతారామ నీళ్లు ఇవ్వకపోతే తిరుగుబాటు


కెనాల్‌ను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

జూలూరుపాడు, మార్చి 24: సీతారామ ప్రాజెక్ట్ ప్రధాన కాల్వ నిర్మాణ పనులను కొనసాగించకుండా, సాగు నీటిని పక్క జిల్లాకు తరలిస్తే తిరుగుబాటు తప్పదని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు హెచ్చరించారు. స్థానిక రైతులతో కలిసి స్థానిక వినోభానగర్ సమీపంలోని ప్రధాన కాల్వ నుంచి ఏన్కూరు సాగర్ కాల్వ వరకు నిర్మించిన సోతారామ ప్రాజెక్ట్ కెనాల్ పనులను సోమవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రాజెక్ట్ భూనిర్వాసితులకు అన్యాయం చేసి, జిల్లా రైతులకు నీరందించకుండా పక్క జిల్లాకు తరలించడం సరికాదని అన్నారు. పాత డిజైన్ ప్రకారం కాల్వ నిర్మాణ పనులను పూర్తి చేసి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైతులకు నీరందించాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని రైతులను కాదని నీటిని తరలిస్తే ఉద్యమిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ములకలపల్లి, మార్చి 24: సీతారామ ప్రాజెక్ట్ లిఫ్ట్ ఇరిగేషన్ పంప్ హౌస్‌లను సీపీఎం నాయకులు పరిశీలించారు. సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

అశ్వాపురం, మార్చి 24: జిల్లాను ఎండగట్టి ఖమ్మం జిల్లాకు ఆగమేఘాల మీద నీటిని విడుదల చేయడం సరికాదని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సీతారామ ప్రాజెక్టు సందర్శనకు వచ్చిన సీపీఎం బృందంతో ఆయన కుమ్మరిగూడెం వద్ద ప్రారంభమైన సీతారామా ప్రాజెక్టు కెనాల్‌ను సందర్శించారు.

## ఎస్పీకి సీఆర్‌పీఎఫ్ ఐజీ అభినందన

కొత్తగూడెం ప్రగతి మైదాన్, మార్చి 24: పార్లమెంట్ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించినందుకుగాను ఎస్పీ బిరుదరాజు రోహిత్‌రాజును సీఆర్‌పీఎఫ్ ఐజీ చారుసిన్హా అభినందనలు తెలిపారు. హైదరాబాద్‌లోని సౌత్ సెక్టార్ కార్యాలయంలో సోమవారం ఎస్పీ రోహిత్ రాజుకు డీజీ డిస్క్‌తోపాటు ప్రశంసాపత్రాన్ని ఐజీ చారుసిన్హా అందజేశారు.

## తల్లిదండ్రులు మందలించారని యువకుడి ఆత్మహత్య

ములకలపల్లి, మార్చి 24: తల్లిదండ్రులు మందలించారన్న కోపంతో ఓ యువకుడు చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని గుట్టగూడెంలో గుండి అర్జున్–భారతి దంపతుల కుమారుడు చైతన్య(19) చెడు వ్యసనాలకు బానిసగా మారి, ఆవారాగా తిరుగుతున్నాడు. అతడిని తల్లిదండ్రులు మందలించారు. దీంతో కోపోద్రిక్తుడైన చైతన్య, ఇంటి నుంచి బయటకు వెళ్లి, గ్రామ శివారులోని పాములేరు వాగు వెంబడి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం ఉదయం గ్రామస్తులు గమనించి, అతడి తల్లిదండ్రులకు చెప్పారు. తండ్రి అర్జున్ ఫిర్యాదుతో ఎస్సై రాజశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

### భర్త మందలింపుతో మహిళ..

పాల్వంచ రూరల్, మార్చి 24: భర్త మందలింపు తట్టుకోలేని గృహిణి పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని సారెకల్లు గ్రామానికి చెందిన దంపతులు మడకం రామా–రాజీ.. రోజువారీ కూలీలు. కొన్నాళ్ల నుంచి మద్యానికి రాజీ బానిసగా మారింది. మద్యం మానేయాలంటూ ఆమెను భర్త రామా పలుమార్లు హెచ్చరించాడు. అయినప్పటికీ ఆమెలో మార్పు రాలేదు. ఈ నెల 21న అతడు ఆమెను తీవ్రంగా మందలించాడు. దీనిని తట్టుకోలేని ఆమె.. ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగింది. కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం మృతిచెందింది. రామా ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## రైతు వేదిక ఆవరణలోని చెట్లు దగ్ధం

ఇల్లెందు, మార్చి 24: ఇల్లెందు మండలం సుదిమళ్లని రైతు వేదిక ఆవరణలోగల సుమారు 200 మొక్కలు దగ్ధమయ్యాయి. దీనిపై ఇల్లెందు వ్యవసాయ శాఖ అధికారి సతీష్‌ను 'నమస్తే' వివరణ కోరింది. ఈ చెట్లకు ఎవరో నిప్పు పెట్టారని, పోలీసులకు ఫిర్యాదు చేస్తామని అన్నారు.

## రామయ్యను దర్శించుకున్న మద్రాస్ హైకోర్టు జడ్జి


రామయ్య సన్నిధిలో జడ్జి శివజ్ఞానం

భద్రాచలం, మార్చి 24: భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానంలో స్వామివారిని మద్రాస్ హైకోర్టు జడ్జి వి.శివజ్ఞానం సోమవారం కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. జడ్జికి ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన గర్భగుడిలో పూజలు చేయగా అర్చకులు శేషవస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. భద్రాచలం ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ శివనాయక్, పట్టణ సీఐ రమేష్, ఆలయ సూపరింటెండెంట్ సాయిబాబా, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

పర్ణశాల, మార్చి 24: పర్ణశాల దేవాలయాన్ని చెన్నై హైకోర్టు జస్టిస్ వి. శివజ్ఞానం దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. వారి వెంట ఆలయం ఇంచార్జి అనిల్‌కుమార్, ఆలయ అర్చకులు కిరణ్‌కుమార్ చార్యులు, దుమ్ముగూడెం ఎస్సై గణేష్ పాల్గొన్నారు.

## భద్రాద్రి రామయ్యకు ముత్తంగి అలంకరణ

భద్రాచలం, మార్చి 24: భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానంలో సోమవారం అంతరాలయంలో మూలవరులకు హైదరాబాద్‌కు చెందిన భక్తులు రూ.30 లక్షలతో తయారు చేయించి సమర్పించిన ముత్యాలు పొదిగిన ప్రత్యేక గొడుగులను అర్చకులు స్వామి వారికి ధరింపచేశారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాతం పలికి ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు, నిత్యబలిహరణం నిత్యపూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి బేడామండపంలో నిత్యకల్యాణాన్ని జరిపారు.

## క్రీడా సామగ్రికి టెండర్ల ప్రక్రియ ప్రారంభం


టెండర్ల ప్రక్రియను ప్రారంభిస్తున్న పీవో రాహుల్

భద్రాచలం, మార్చి 24: గిరిజన సంక్షేమశాఖ క్రీడా పాఠశాలలకు సరఫరా చేసే టీ షర్టులు, షార్ట్, ట్రాక్ షూట్ క్రీడా సామగ్రికి సంబంధించి టెండరు ప్రక్రియను ఐటీడీఏ పీవో రాహుల్ సోమవారం ప్రారంభించారు. ఖమ్మం, మహబూబాబాద్, భద్రాచలం నుంచి ముగ్గురు ఏజెన్సీదారులు టెండర్లు దాఖలు చేయగా తక్కువ ధరకు టెండరు కోడ్ చేయడంతో కమిటీ సభ్యుల సమక్షంలో ఆమోదించినట్లు పీవో తెలిపారు. టెండర్ల సమయంలో హెచ్ఎంలు శాంపిల్ ప్రకారం చూపిన టీషర్టు, షార్ట్, ట్రాక్ సూట్ పరిశీలించి తీసుకోవాలని, క్రీడాదుస్తులు సరఫరా చేసే ఏజెన్సీదారులు నిబంధనలను అతిక్రమించి ఇతర క్రీడాదుస్తులు సరఫరా చేసినట్లు తెలిస్తే ఏజెన్సీలు రద్దుచేయడంతో పాటు శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డీడీ మణెమ్మ, ఈఈ చంద్రశేఖర్, స్పోర్ట్స్ అధికారి గోపాలరావు, ఏటీడీవో అశోక్, జీసీసీ మేనేజర్ జయరాజ్, పీడీ, పీఈటీ, హెచ్ఎంలు, సిబ్బంది అశోక్, ఏజెన్సీదారులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల విశ్వాసం కోల్పోయింది


మాట్లాడుతున్న రావులపల్లి రాంప్రసాద్

భద్రాచలం, మార్చి 24: కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు రావులపల్లి రాంప్రసాద్ మండిపడ్డారు. సోమవారం పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరైతే వాళ్లు ప్రారంభించినట్లు గొప్పలు చెప్పడంతో పాటు డంపింగ్ యార్డు ప్రారంభించి కూడా గొప్పలు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బీఆర్ఎస్ నాయకులు ఆకోజు సునీల్‌కుమార్, రేపాక పూర్ణచందర్‌రావు, కొల్లం జయప్రేమకుమార్, బొల్లి వెంకట్రావు, కాలువ పూర్ణయ్య, కొత్తా మల్లేష్, భక్తుల నర్సింహులు, అంబటి కర్ర కృష్ణ, నాగేశ్వరరావు, డానియేల్, ప్రదీప్, ఖాదర్, శివ, మోహనరావు పాల్గొన్నారు.

## ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

పర్ణశాల, మార్చి 24: దుమ్ముగూడెం మండలం గౌరారం గ్రామంలో గ్రామపెద్దలు, యువత సహకారంతో నెల రోజులుగా కొనసాగిన దుమ్ముగూడెం – చర్ల మండలాల క్రికెట్ టోర్నమెంట్ సోమవారంతో ముగిసింది. ఈ టోర్నమెంట్‌లో కొత్తూరు ఏ టీమ్ విన్నర్‌గా నిలిచింది. రూ.50 వేలు నగదుతో పాటు షీల్డ్ అందుకుంది. రన్నర్ టీమ్‌గా పైడాకులమడుగు రూ.30 వేలతో పాటు షీల్డ్ అందుకుంది. మూడో స్థానంలో పెద్దనల్లబెల్లి టీమ్ రూ.20 వేలు బహుమతి అందుకుంది. నాల్గవ స్థానంలో సుబ్బారావుపేట టీమ్ రూ.10 వేలు గెలుచుకుంది. కార్యక్రమంలో నిర్వాహకులు కనితి రాముడు, ఉయిక రమేష్, శీలం వెంకటేష్, బుద్దుల జంపన్న, సోడి రాజు, శీలం సంతోష్ పాల్గొన్నారు.

## ఘనంగా సీఆర్పీఎఫ్ ఆవిర్భావం

పర్ణశాల, మార్చి 24: 217వ కార్ప్స్ సెంట్రల్ రిజర్వు పోలీస్ ఫోర్స్ (సీఆర్పీఎఫ్) 15వ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు సీఆర్పీఎఫ్ కార్యాలయంలో బడాఖానా అత్యంత వైభవంగా నిర్వహించారు. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ జనరల్ సూరజ్‌పాల్, ఆనంద్ సింగ్ రాజ్‌పురోహిత్ పాల్గొని తమ సందేశాలను వివరించారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
Classifieds

WANTED
★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-330667-All

EAPCET NEET
ONLINE CRASH COURSE
30 days @ Rs 8888/-
TEST SERIES
5 Grand Tests @ 888/-
50% Discount Today
Call: 8645 322 633
Jatadhara Ed Tech

అతి తక్కువ ఖర్చు
అత్యధిక ప్రచారం

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

## చెల్లని చెక్కు కేసులో వ్యక్తికి జైలు

భద్రాచలం, మార్చి 24: భద్రాచలం ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి శివనాయక్ సోమవారం చెల్లని చెక్కు కేసులో వ్యక్తికి 6 నెలల జైలు, రూ.2.60లక్షలు జరిమానా విధించారు. బూర్గంపహాడ్ మండలం సారపాకకు చెందిన జాదవుల కనకయ్య వద్ద బయ్యారానికి చెందిన నాగారపు వెంకటేశ్వర్లు చెక్కు హామీగా పెట్టి రూ.2.60 లక్షలు తీసుకున్నాడు. ఆ చెక్కు బ్యాంకులో వేయగా బౌన్స్ అయింది. జాదవుల కనకయ్య కోర్టులో కేసు వేయగా వాదోపవాదాల అనంతరం ముద్దాయి వెంకటేశ్వర్లుకు 6 నెలల జైలుశిక్షతో పాటు రూ.2.60 లక్షల చెల్లించాలని తీర్పు విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారు. ఫిర్యాదుదారుడు తరపున ప్రముఖ న్యాయవాది ముత్యాల కిశోర్ కేసు వాదించారు.

## నేటి నుంచి నాగులమ్మ, సారలమ్మ జాతర

పినపాక, మార్చి 24 మండలంలోని జానంపేట గ్రామంలో ఉన్న ఆదిశక్తి నాగదేవత సారలమ్మల జాతర ఉత్సవాలు మంగళవారం నుంచి జరుగనున్నట్లు దేవరబాల జనార్దన్ స్వామి సోమవారం తెలిపారు. మంగళవారం గుడి మేల్కొలుపు జాతర ప్రారంభం, బుధవారం నాగదేవత అమ్మవారిని గుట్ట నుంచి గుడికి తీసుకువచ్చి గద్దె నింపడం, గురువారం వనదేవత రాక, రాత్రి ఘనంగా నాగదేవత కళ్యాణం, అగ్ని గుండంలో ప్రవేశం జరుగును. శుక్రవారం అమ్మవార్లకు మొక్కులు చెల్లించుట, శనివారం నాగదేవత గుడి నుంచి గుట్టకు వెళ్లే కార్యక్రమం జరుగుతుందన్నారు.

## సీజ్ చేసిన ఇసుకకు వేలం

పినపాక, మార్చి 24: మండలంలోని ఈ బయ్యారం అడ్డ రోడ్‌లోని ఓ పెట్రోల్ బంక్‌లో అక్రమంగా నిల్వ చేసిన సుమారు 30 ట్రాక్టర్ల ఇసుకను ఈ నెల 15వ తేదీన రెవెన్యూ అధికారులు పట్టుకుని సీజ్ చేసిన విషయం విదితమే. అయితే ఆ ఇసుకకు సోమవారం తహసీల్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించారు. జానంపేట గ్రామానికి చెందిన తోలెం నరేష్ రూ.23,300 కు వేలంలో ఇసుకను దక్కించుకున్నారు.

## పేకాట రాయుళ్ల అరెస్టు

కరకగూడెం, మార్చి 24: పేకాట స్థావరాలపై కరకగూడెం పోలీసులు సోమవారం దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఆరుగురిని పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని బుర్థారం గ్రామ అటవీ సమీపంలో అక్రమంగా పేకాట ఆడుతున్నారని పక్కా సమాచారం రావడంతో ఎస్ఐ రాజేందర్ తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. వారి నుంచి రూ.7వేలు, 2 సెల్‌ఫోన్లు, ప్లేయింగ్ కార్డ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## పోస్టుల భర్తీకి పరీక్ష నిర్వహించాలి

మణుగూరు టౌన్, మార్చి 24: మణుగూరు ఏరియాలో చార్జర్ సేఫ్టీ ల్యాంప్ పోస్టులు భర్తీ చేయడానికి అర్హత పరీక్ష నిర్వహించాలని కోరుతూ టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాపు కృష్ణ, కార్పొరేట్ ఉపాధ్యక్షుడు తుమ్మ శ్రీనివాసరావు నేతృత్వంలో మణుగూరు టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు నాగెల్లి వెంకటేశ్వర్లు కార్పొరేట్ జీఎం పర్సనల్ కవితా నాయుడును సోమవారం కలిసి వినతిపత్రాన్ని అందించారు.

## జగదీష్‌కాలనీలో సైడ్ డ్రైన్ నిర్మించండి

భద్రాచలం, మార్చి 24: పట్టణంలోని జగదీష్‌కాలనీ శివారు ఎల్‌బీజీనగర్ గుట్టపై ఉన్న ప్రాంతంలో డ్రైనేజీ నిర్మించకపోవడం వల్ల మురుగు రోడ్లపైకి వచ్చి తీవ్ర దుర్వాసన వస్తుందని సీపీఎం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అన్నారు. సోమవారం జగదీష్‌కాలనీ శివారు ప్రాంతంలో సమస్యలపై సీపీఎం బృందం సర్వే నిర్వహించింది. ఈ సర్వేలో ప్రజలు తమ సమస్యలను సీపీఎం బృందానికి విన్నవించారు.

## ప్రశాంతంగా ఆంగ్లం పరీక్ష

కొత్తగూడెం గణేష్ టెంపుల్, మార్చి 24: ఈ నెల 21 నుంచి ప్రారంభమైన పదవ తరగతి పరీక్షల్లో భాగంగా మూడవ రోజు థర్డ్ లాంగ్వేజ్ ఆంగ్లం ప్రశాంతంగా ముగిసినట్లు డీఈవో వెంకటేశ్వరచారి ఒక ప్రకటనలో తెలిపారు.

## బీఆర్ఎస్ లీగల్ అడ్వైజర్ల నియామకం

ఇల్లెందు, మార్చి 24: ఇల్లెందు అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్ లీగల్ సెల్ అడ్వైజర్లుగా మామిడి సత్యప్రకాష్‌ను, కీర్తి కార్తీక్‌ను పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు తెలిపారు. ఆయన సోమవారం ఇల్లెందులోని పార్టీ కార్యాలయంలో సమావేశంలో మాట్లాడారు. పార్టీకి సంబంధించిన కోర్టు కేసుల పరిష్కారానికి సంప్రదించవచ్చని చెప్పారు.

## బెట్టింగులకు దూరంగా ఉండాలి

కరకగూడెం, మార్చి 24: యువత బెట్టింగు మోజులో పడి జీవితాలను నాశనం చెసుకోవద్దని కరకగూడెం ఎస్ఐ రాజేందర్ అన్నారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఐపీఎల్ క్రికెట్ నడుస్తుందని, ఈ క్రమంలో విపరీతంగా డబ్బులు చేతులు మారుతున్నాయన్నారు. బెట్టింగ్‌లో డబ్బులు పెట్టి తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు.

బూర్గంపహాడ్, మార్చి 24: మండలంలో యువత బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని బూర్గంపహాడ్ ఎస్సై రాజేష్ హెచ్చరించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. యువత బెట్టింగ్ యాప్స్ వంటి వ్యసనాలకు దూరంగా ఉండేలా తల్లిదండ్రులు చొరవ చూపాలన్నారు.

## మంగళ బోడులో వైద్య శిబిరం

చంద్రుగొండ, మార్చి 24: మండలంలోని మద్దుకూరు పంచాయతీ మంగళబోడు గ్రామంలో సోమవారం వైద్య శిబిరాన్ని జిల్లా మలేరియా ప్రోగ్రాం అధికారి డాక్టర్ స్పందన నిర్వహించారు. జ్వర పీడితుల నుంచి రక్త నమూనాలు సేకరించారు. పరిసరాల పరిశుభ్రత, మలేరియాపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

## చెట్లు నరికిన వ్యక్తిపై కేసు

అశ్వారావుపేట, మార్చి 24: అడవిలోని చెట్లు నరికిన వ్యక్తిపై అటవీ అధికారులు సోమవారం కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాలు.. పట్టణానికి చెందిన కృష్ణ, కన్నాయిగూడెం సమీపంలోని ఫారెస్ట్ కార్పొరేషన్ భూమిలో వంట చెరుకు కోసం చెట్లు నరికాడు. దానిని లారీలో తరలిస్తుండగా రేంజర్ ఎం.మురళి అడ్డుకున్నారు. 3.5 మెట్రిక్ టన్నుల కలపను స్వాధీనపర్చుకున్నారు. దీని విలువ రూ.15 వేలకు పైగా ఉంటుంది. లారీని రేంజర్ సీజ్ చేసి, కృష్ణపై కేసు నమోదు చేశారు.

## చలివేంద్రం ప్రారంభం

టేకులపల్లి, మార్చి 24: స్థానిక బోడు రోడ్ సెంటర్‌లో పంచాయతీ చలివేంద్రాన్ని కార్యదర్శి ఉప్పు దీప్తి సోమవారం ప్రారంభించారు. మాజీ ఉప సర్పంచ్ నోముల కళావతి తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

టేకులపల్లి, మార్చి 24: మండలంలోని బిల్లుడు తండాకు చెందిన అజ్మీర మాన్‌సింగ్, సోమవారం మధ్యాహ్నం శంభూనిగూడెం మొర్రేడు వాగు నుంచి ఇసుకను ట్రాక్టర్‌లో అక్రమంగా రవాణా చేస్తుండగా ముత్యాలంపాడు క్రాస్ రోడ్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. దానిని స్టేషన్‌కు తరలించారు. మాన్‌సింగ్‌పై ఎస్సై పి.సురేష్ కేసు నమోదు చేశారు.

## అక్రమంగా తరలిస్తున్న కోడె దూడలు..

టేకులపల్లి, మార్చి 24: అక్రమంగా తరలిస్తున్న ఐదు కోడె దూడలను పోలీసులు స్వాధీనపర్చుకున్నారు. ఎస్సై పి.సురేష్ తెలిపిన వివరాలు.. తడికెలపూడి నుంచి సూర్యాపేటకు ఐదు కోడె దూడలతో వెళ్తున్న ట్రాలీ(టీఎస్ 29టీ2536)ని తడికలపూడి క్రాస్ రోడ్డులో పోలీసులు సోమవారం పట్టుకున్నారు. కోదాడకు చెందిన గరుడపల్లి లాలయ్యను, సూర్యాపేటకు చెందిన మొర్రం నాగరాజును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఐదు కోడె దూడలను పాల్వంచలోని అన్నపూర్ణ గోసంరక్షణ సమితికి అప్పగించారు.

## కోడి పందేల స్థావరంపై దాడి

ములకలపల్లి, మార్చి 24: స్థానిక రాజుపేట కాలనీలో కోడి పందాల స్థావరంపై ఎస్సై రాజశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం దాడి చేశారు. ఐదుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.1500, మూడు కోడి పుంజులు స్వాధీనపర్చుకున్నారు. కేసు నమోదు చేశారు.

## ఇద్దరు దొంగల అరెస్ట్

సుబేదారి, మార్చి 24 : తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్ చేసుకొని చోరీలకు పాల్పడిన ఇద్దరు దొంగలను సుబేదారి పోలీసులు అరెస్ట్ చేసి రూ.లక్షా70వేల విలువైన బంగారు అభరాణాలు, రూ.90వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం సుబేదారి పోలీసు స్టేషన్‌లో ఏసీపీ దేవేందర్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం కమలాపూర్‌కు చెందిన నిమ్మల వినయ్‌కుమార్, కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లికి చెందిన తంబల్ల నితిన్ సుబేదారి పోలీసు స్టేషన్ పరిధి సంతోష్‌నగర్‌లో ఈ నెల 19న కుమార్‌స్వామి ఇంటి తాళాలు పగలగొట్టి దొంగతనం చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు. సీసీ కెమెరాల ద్వారా నిందితులు వినయ్‌కుమార్, నితిన్‌ను గుర్తించి హనుమకొండ అదాలత్ వద్ద అరెస్ట్ చేసి బంగారు చెవి కమ్మలు, మాటీలు, వెండి బిస్కెట్లు, వెండి పట్ట గొలుసులు, రూ.90వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.

## వంట పాత్రలు పంపిణీ

ములకలపల్లి, మార్చి 24: మండలంలోని 62 ప్రభుత్వ పాఠశాలల్లోని మధ్యాహ్న భోజన కార్మికులకు వంట పాత్రలను ఎంఈవో సత్యనారాయణ సోమవారం పంపిణీ చేశారు. వీటిని హైదరాబాద్ అగ్రికల్చర్ కో–ఆపరేటివ్ అసోసియేషన్ లిమిటెడ్ సమకూర్చింది.